క్లుప్తంగా

నేడు, రేపు గడప గడపకు మన ప్రభుత్వం

ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడు, దేపూరు గ్రామాల్లో శని, ఆదివారాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని మేకపాటి కార్యాలయం ప్రతినిధులు, ఆత్మకూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నేడు గడప గడపకుపై సమీక్ష

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయ ఎంజీఆర్ సమావేశ మందిరంలో శనివారం సమీక్ష నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అన్నిశాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో పాటు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొంటారన్నారు.

గుండెపోటుతో ఇరిగేషన్ ఏఈ మృతి


మస్తాన్ (ఫైల్)

ఆత్మకూరు: సోమశిల ప్రాజెక్ట్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాదర్ మస్తాన్ (56) శుక్రవారం తెల్లవారుజామున తీవ్రమైన గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఆత్మకూరు, మర్రిపాడు, సీతారామపురం మండలాల్లో ఇరిగేషన్‌శాఖ ఏఈగా విధులు నిర్వహించారు. గురువారం రాత్రి విధుల అనంతరం ఆత్మకూరుకు వస్తున్న క్రమంలో గుండెపోటు రావడంతో తొలుత కలువాయి ఆస్పత్రికి.. మెరుగైన చికిత్స నిమిత్తం ఆత్మకూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు మస్తాన్‌కు భార్య, వివాహమైన కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏఈ ఆకస్మిక మృతితో ఇరిగేషన్‌శాఖ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

లోకేష్‌పై పోలీసులకు ఫిర్యాదు


లోకేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ చేజర్ల ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న రఫి

చేజర్ల: రెండు రోజుల నుంచి టీడీపీ నేత లోకేష్ వ్యాఖ్యలు వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఆత్మకూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ మహమ్మద్ రఫి అన్నారు. 2019 నుంచి 2024 వరకు ఎవరిపైన ఎక్కువ కేసులుంటాయో అలాంటి వారికి నామినేటెడ్ పదవులు ఇస్తానని చెప్పడం సిగ్గు చేటన్నారు. తరచూ నాయకులను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. రెచ్చగొచ్చే వ్యాఖ్యలు చేస్తున్న లోకేష్, చంద్రబాబు, అచ్చెన్నాయుడుపై తగిన చర్యలు తీసుకోవాలని చేజర్ల ఎస్సై మరిడి నాయుడు ఫిర్యాదు చేశారు.

అల్లు అర్జున్ ఫ్యాన్స్ సంబరాలు


కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న అల్లూరు అర్జున్ ఫ్యాన్స్

కావలి: తెలుగువాడు అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు ప్రకటించడంపై సీనియర్ న్యాయవాది, మెగా అభిమాని చింతాల వెంకట్రావు ఆధ్వర్యంలో శుక్రవారం అల్లు అర్జున్ అభిమానులు, మెగా అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. చింతాల వెంకట్రావు మాట్లాడుతూ 69 సంవత్సరాల సినీ చరిత్రలో అల్లు అర్జున్‌కు జాతీయ అవార్డు ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ టౌన్ వైడ్ ఫ్యాన్స్ సెక్రటరీ గంగనపల్లి కుమార్, ట్రెజరర్ మనోహర్, చిరంజీవి యువత అధ్యక్షుడు చేగు నారాయణ, పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఆశా శ్రీనాథ్, రిషి, సాయి, మురళి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఇంద్రాక్షి తిరునాళ్లు


పాల పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం చుంచులూరులో కొలువైన ఇంద్రాక్షి అమ్మవారి తిరునాళ్ల రెండో రోజు శుక్రవారం కోలాహలంగా జరిగాయి. అమ్మవారికి పూలంగి సేవ, పాలాభిషేకం, పంచామృతాభిషేకం, చందనాభిషేకం, నారికేళ ఫలాభిషేకం, పల్లకి సేవ, పాలపొంగళ్లు తదితర పూజా కార్యక్రమాలను మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నిర్వహించారు.

వరాలిమ్ము.. వరలక్ష్మీ..


ఉదయగిరిలో ప్రత్యేకాలంకరణలో అన్నపూర్ణాదేవి


శ్రీ పంచముఖ శక్తిగణపతి దేవస్థానంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న మహిళలు


వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు


సోమశిల హిల్‌కాలనీలో వరలక్ష్మి వ్రత పూజలు

ఆత్మకూరు: శ్రావణ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారానికి అధిక ప్రాధాన్యం ఉంది. ఆ రోజున వరలక్ష్మీ వ్రతం నిర్వహించుకోవడం సంప్రదాయం. పట్టణంలోని జేఆర్‌పేట వెంకటేశ్వర స్వామి ఆలయం, ఆర్యవైశ్యులతో నిర్మించిన కోదండరామాలయం, చెరువు వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత శివాలయం జ్వాలాముఖి అమ్మవారి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలతో సామూహికంగా ఆలయ అర్చకులు వరలక్ష్మీ వ్రతాలు నిర్వహింపజేశారు. జేఆర్‌పేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించారు. కలశ స్థాపన చేసి సంప్రదాయంగా మహిళలతో వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమ పూజలు చేయించారు. చేతులు తోరాలు కట్టించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లిలో శ్రీపంచముఖ శక్తిగణపతి దేవస్థానం వద్ద శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ పూజారి పాశర్ల వెంకటేశ్వర్లుశర్మ సంప్రదాయబద్ధంగా వరలక్ష్మీ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. పాశర్లపూడి సుధామణి లక్ష్మీదేవిని స్తుతిస్తూ పాడిన భక్తి పాటలు భక్తులను అలరించాయి.

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని సోమశిల హిల్ కాలనీలో శుక్రవారం వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. సోమశిలలోని హిల్ కాలనీలో మల్లెంకొండేశ్వరస్వామి ఆలయంలో మహిళలు వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సంగం: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రత పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

ఉదయగిరి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీవ్రత వేడుకలు మహిళలు భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. పట్టణంలోని శివాలయం, సంతానలక్ష్మి ఆలయాలతో పాటు మండలంలోని గండిపాళెం సిద్ధేశ్వరాలయం, అప్పసముద్రం మహాలక్ష్మమ్మ ఆలయం, యర్రబల్లిగడ్డ అన్నపూర్ణాదేవి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఉదయగిరి శివాలయంలో వరలక్ష్మీవ్రత వేడుకలు నిర్వహించారు. మహిళలు ఇళ్లలో వ్రతాలు నిర్వహించుకుని వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

– **వింజమూరు** మండలంలోని వింజేటమ్మకొండ, శివాలయం, చెన్నకేశవస్వామి ఆలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వరలక్ష్మీవ్రత పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. మండలంలోని పలు దేవాలయాల్లో మహిళలు వేకువజామునే పూజలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

దుత్తలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మీవ్రత పూజలు మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్ల వద్ద లక్ష్మీదేవిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చారు. సమీప దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని ఘనంగా మహిళలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయం, వరికుంటపాడులోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. మహిళలు ఒకరికొకరు వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

జలదంకి: మండలంలో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం వేడుకలను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. పలు ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టారు. బ్రాహ్మణక్రాక వేణుగోపాలస్వామి ఆలయంలో వేద పండితులు ఆధ్వర్యంలో వ్రతం నిర్వహించారు. అమ్మవారికి అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులకు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తుమ్మల శ్రీకాంత్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కలిగిరి: కలిగిరిలోని కొత్తూరు కోదండరామస్వామి ఆలయం వద్ద మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో సాముహిక వరలక్ష్మీ వత్రాలు నిర్వహించారు. ఉపవాసాలు ఉండి మొక్కులు తీర్చుకున్నారు.


ఆత్మకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం


బ్రాహ్మణక్రాక వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు


మానసాదేవి ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

చట్టాలపై అవగాహన పెంచుకోండి

• బి.రాజేష్, సీనియర్ సివిల్ జడ్జి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి రాజేష్

ఆత్మకూరు: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలు రాజ్యాంగం ప్రకారం సంక్రమించే హక్కులను తెలుసుకోవాలని ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి.రాజేష్ అన్నారు. మండల న్యాయసేవా అధికార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ సచివాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి రాజేష్ మాట్లాడుతూ తప్పనిసరిగా మహిళలు చదువుకోవాలని, చదువు విలువ తెలుసుకోవాలన్నారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం నేరమని, బాల్య వివాహాలు జరుగుతున్న సమాచారం ఎవరికైనా తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తాము విధులు నిర్వహించే సమయంలో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎల్‌వీ రమణయ్య, సచివాలయ అడ్మిన్ కామాక్షి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

• ఎంజీఆర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేవీ శ్రావణ్‌కుమార్

ఆత్మకూరు: క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ వారికి ఉంటుందని మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎస్‌ఆర్‌జేడీ కళాశాల మైదానంలో మేకపాటి గౌతమ్ రెడ్డి (ఎంజీఆర్) క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. తొలుత దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. డాక్టర్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ దివంగత మేకపాటి గౌతమ్ రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహించేందుకు తమ సొంత నిధులతో ఎందరికో క్రీడా పరికరాలను అందించారన్నారు. అదే స్ఫూర్తితో తాము సైతం క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. చదువుతో పాటు వారికి నచ్చిన క్రీడల్లో ప్రావీణ్యం చూపి క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించాలని యువతను ఆయన ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ శివకోటారెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, కె చిన్నపరెడ్డి, సయ్యద్ జమీర్, పూనూరు ఫణికృష్ణారెడ్డి, వెంగళరెడ్డి, టి వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

• మగ్గం నేసిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


మగ్గం నేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

అనుమసముద్రంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత కుటుంబాలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జమ్మవరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఓ నేతన్న ఇంట్లో ఏర్పాటు చేసిన మగ్గాన్ని పరిశీలించారు. కాసేపు మగ్గం చీర నేసి నేతన్నలతో మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం అందజేయని విధంగా సంవత్సరానికి రూ.24 వేలు నేతన్న నేస్తం పథకం కింద చేస్తున్నారని, దీంతో నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. నేతన్నల వద్ద నేసిన దుస్తులను ఆన్‌లైన్ వెబ్‌సైట్‌ల ద్వారా విక్రయించే వెసులుబాటు కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని, నేతన్నలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలపై ఎమ్మెల్యే దృష్టి

కావలి: నియోజకవర్గంలో ఇతర పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరే వారిపై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి దృష్టి పెట్టారు. ప్రస్తుతం తాము‌న్న పార్టీల్లో ఉండలేమని, పని చేయలేకపోతున్నామని, మళ్లీ 2024లో ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బలమైన అభిప్రాయానికి రావడంతో ముఖ్యమైన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరుతామని ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ప్రతిపక్షంలో కీలకంగా ఉన్న ఓ నాయకుడు వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధం కావడంతో ఆయన్ను ఆహ్వానించేందుకు ఎమ్మెల్యే ఆమోదం తెలిపారు. దీంతో ఆ పార్టీ మునిగిపోయినట్లే అని అంటున్నారు.

దర్గా స్థలాన్ని పరిశీలించిన సీఐ

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం సోమశిలలో గురువారం ఇరువర్గాల మధ్య దర్గా స్థల విషయమై ఘర్షణ జరిగిన నేపథ్యంలో శుక్రవారం ఆత్మకూరు సీఐ జి.వేణు దర్గా స్థలాన్ని పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ దర్గా ప్రాంతలో గొడవలు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీఓను కలిసి పరిష్కరించుకోవాలన్నారు. సోమశిల ఎస్సై భోజ్యానాయక్, సిబ్బంది ఉన్నారు.

ఒక ఇల్లు దగ్ధం

చేజర్ల: మండలంలోని వావిలేరు గిరిజనకాలనీలో శుక్రవారం అగ్ని ప్రమాదంలో ఒక ఇల్లు దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు.. తిక్కవరపు రవి, పెంచలమ్మ దంపతులు కూలీ పనులు చేసుకుని తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అప్పటికే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం గానే మంటలు చెలరేగి ఉండొచ్చని భావిస్తున్నారు.

ఓటును పరిశీలించుకోవాలి

కావలి: పట్టణ ప్రజలు ఓటర్ల జాబితాలో తమ ఓట్లను పరిశీలిచుకోవాలని కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న వివరాలకు అనుగుణంగా కావలి పురపాలక సంఘ పరిధిలోని ఓటర్ల జాబితా సవరణలో భాగంగా, కొంత మంది ఓటర్లు అందుబాటులో లేరని వెల్లడించారు. సదరు జాబితాను రాజకీయ ప్రతినిధులకు, బూత్ లెవల్ ఏజంట్లకు, బూత్ లెవల్ అధికారులకు, ప్రతి సచివాలయం నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఎవరైన ఓటర్లు కొత్తగా వచ్చినా, గతంలో ఎక్కడ ఓటు వేసినారో వాటి వివరాలతో, ఓటరు గుర్తింపు కార్డులతో సంప్రదించి మీ ఓటు వివరాలను సరిచూసుకోవడం, కొత్తగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ చెప్పారు.

గేదెను ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

దుత్తలూరు: మండలంలోని చింతలగుంట సమీపంలో ఓ వ్యక్తి మోటార్ బైక్‌పై వెళ్తూ గేదెను ఢీకొనడంతో గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. ఉదయగిరి మండలం బిజ్జంపల్లికి చెందిన భాస్కర్ దుత్తలూరు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా చింతలగుంట సమీపంలో రోడ్డుపై ఒక్కసారిగా గేదె అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయగిరి వైద్యశాలకు తరలించారు.

వీఓఏలను ఆదుకోవాలని సీఎంకు ఎమ్మెల్యే వినతి


ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి సమస్యలవినతి ప్రతాన్ని అందజేస్తున్న వీఓఏలు

కావలి: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక సమీకరణ, గ్రామీణ పేదల జీవనోపాధిని మెరుగు పరచడం ద్వారా పేదరికం తగ్గింపును సులభతరం చేయడానికి సహాయక నిర్మాణంగా స్థాపించబడిన సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్‌ఈఆర్పీ)లో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లుగా (వీఓఏ)సేవలు అందిస్తున్న 27,837 మందిని ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కావలిలోని ఎమ్మెల్యే నివాసంలో వీఏఓలు ఎమ్మెల్యేను కలిసి తమ ఆవేదన తెలియజేశారు. ఈ మేరకు వీఏఓలకు మద్దతుగా సీఎంకు వినతిపత్రంలో కోరారు. గ్రామాల్లో నిపేదలైన మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు డ్వాక్రాలో గ్రూపులను ఏర్పాటు చేయడంలో వీఏఓలు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, సున్నా వడ్డీ, జగనన్న తోడు, జగనన్న హౌసింగ్ కాలనీ, పేదరిక నిర్మూలన, జీవనోపాధి తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడంలో క్రియాశీలకంగా సేవలు అందిస్తున్నారన్నారు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు 24 ఏళ్లుగా పని చేస్తున్నారని, వారికి ఇంటి అద్దె భత్యంతో ఉద్యోగ భద్రత, నేరుగా బ్యాంకు ఖాతాలో జీతాలు జమ చేయడం, కనీస జీతం, అర్హులైన వీఏఓలకు సీసీలుగా ప్రమోషన్, విధుల్లో 3 ఏళ్ల కాలపరిమితి రద్దు చేయడం, ప్రభుత్వం ద్వారా 5జీ మొబైల్‌ను అందించడం, రూ.10 లక్షలకు బీమా సదుపాయం. 2020 నుంచి పనిచేస్తున్న రిజిస్టర్ వీఓఏలకు జీతాల మంజూరు, ఒక వీఏఓకు 30 గ్రూపుల షరతును సడలించడం తదితర అంశాలను సానుకూల దృష్టితో పరిశీలించాలని ఎమ్మెల్యే సీఎంకు విజ్ఞప్తి చేశారు.

జగనన్న కాలనీల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి

• మంత్రి జోగి రమేష్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి


మంత్రి జోగి రమేష్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, రోడ్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఇంటి నిర్మాణాలు పూర్తయిన చోట్ల కూడా మౌలిక సదుపాయాలు లేకపోవడంతో నివాసదారులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. సత్వరమే మౌలిక సదుపాయాలు కల్పించేందకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రికి నూతన భవనాన్ని నిర్మించండి

• ఆరోగ్య శాఖ మంత్రి రజనికి ఎమ్మెల్యే విజ్ఞప్తి


మంత్రి రజనిని కలిసిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో ఉన్న కావలి ఏరియా వైద్యశాల అత్యంత కీలమైందని, ప్రస్తుతం పట్టణ నడిబొడ్డున ఉన్న ఆస్పత్రి ప్రాంగణం ఇరుకుగా ఉందని, జాతీయ రహదారికి సమీపంలో విశాలమైన స్థలంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనికి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. చిలకలూరిపేట నియోజవర్గంలోని గణపవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం'లో ఉన్న మంత్రిని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం కలిశారు. కావలి పట్టణంలోని ఏరియా ఆస్పత్రి నూతన భవనాన్ని, అల్లూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన భవనాన్ని ప్రారంభించాలని కోరారు. ఎమ్మెల్యేను మంత్రి రజని శాలువతో సత్కరించారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, చెన్ను ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

పార్టీ విజయానికి అహర్నిశలు కృషి చేస్తా


కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న నాయకులు

అల్లూరు: కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నీలం సాయికుమార్ చెప్పారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు బాణసంచా పేల్చి, భారీ కేక్‌ను కట్ చేసి, శాలువాతో ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దండా కృష్ణారెడ్డి, ఉస్మాన్, భాస్కర్, మనోహర్, తాండ్ర మల్లి, సుధా, కరుణాకర్, దాసరి మల్లి రసూల్, శ్రీను, మల్లి, పరిశినేటి రాజేష్, మేడా మాధవ్, శ్రీహరి, శ్రీకాంత్, జంషీర్ పాల్గొన్నారు.

పార్టీ నమ్మకాన్ని నిలబెట్టుతా


మాగంటి శ్రీనివాసులు

వరికుంటపాడు: తనపై పార్టీ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా 2024 ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంతో పాటు జిల్లాలో పార్టీ విజయానికి అహర్నిశలు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబరు మాగంటి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని తూర్పుబోయమడుగుల గ్రామానికి చెందిన శ్రీనివాసులు పార్టీ జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన విషయం తెలిసిందే. తనను జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా ఎంపిక చేసినందుకు నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ పటిష్టతకు కృషి


హర్షవర్ధన్‌రెడ్డి

కలిగిరి: మండలంలో పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ దేవిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. తనను ఈ పదవికి ఎంపిక చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా


రామచంద్రరావు

జలదంకి: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన కొత్తపాళెం మాజీ సర్పంచ్ జ్యోతి రామచంద్రరావు తెలిపారు. రామచంద్రరావు మాట్లాడుతూ నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చేవూరు జనార్దన్‌రెడ్డి ఆశీస్సులతో తనను జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రాష్ట్ర పార్టీ నియమించిందని తెలిపారు.

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి సత్కారం


విక్రమ్‌రెడ్డిని సత్కరిస్తున్న భాగ్యమ్మ, అశోక్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని మురగళ్లకు చెందిన తోడేటి భాగ్యమ్మను వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యురాలిగా నియమించిన నేపథ్యంలో ఆమె తన భర్త అశోక్‌తో కలిసి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని నివాసంలో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. పార్టీ అభ్యున్నతి కోసం శక్తివంచన లేకుండా పాటుపడతామని తెలిపారు.

నేడు 'ఆహా' క్యాంటీన్ ప్రారంభం

కావలి: కావలిలో 'పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ' ద్వారా ఏర్పాటు చేయుచున్న 'ఆహా' క్యాంటీన్‌ను శనివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ప్రారంభిస్తారని కావలి మున్సిపల్ కమిషనర్ ఈ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురు గా ఉన్న అన్నపూర్ణ వస్త్ర మార్కెట్ పక్కన ఉన్న వినా యక స్వామి గుడి పక్కన ఏర్పాటు చేస్తున్న 'ఆహా' క్యాంటీన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.